
నానో యూరియాతో లాభాలెన్నో.. 2





2
బిచ్కుందలో విషాదం.. బస్సు బోల్తా పడి డ్రైవర్

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com


## అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి నియోజకవర్గానికి మంజూరైన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని విద్యార్థిసేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి వినతిపత్రం అందజేశారు. విద్యార్థిసేన జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్ మాట్లాడుతూ.. భిక్కనూరు మండలంలో ఏర్పాటు చేస్తే విద్యార్థులకు రవాణా ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు.

4-9-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

# వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నగరంలో శ్రీకృష్ణ ఆలయాలను ముస్తాబు చేశారు. భక్తులు ఆలయాలకు పోటెత్తారు. నగరంలో ప్రముఖ ఆలయమైన శ్రీకృష్ణ గీతాభవన్‌లో తెల్లవారుజాము నుంచి శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. అలాగే ఆలయంలో రాజు పంతులు, రామనంద్ తివారి ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన జరిపారు. ఈ కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పుష్పార్చనలో పాల్గొన్నారు. అలాగే బైపాస్ తర్వాత మారుతినగర్ రోడ్డు హనుమాన్ మందిరం సమీపంలో శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక అర్చనలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు.

- అక్షరటుడే, నిజామాబాద్ సిటీ




- మిగతా ఫొటోలు 2వ పేజీలో..



# టీచరా.. డేటా ఎంట్రీ ఆపరేటరా..?

**దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రాథమిక విద్యకు ఉపాధ్యాయుడే ప్రధాన స్తంభం. అయితే నేడు ఉపాధ్యాయుడు బోధన కంటే బోధనేతర బాధ్యతలకే ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోంది. డేటా నమోదు, ఆన్‌లైన్ బిల్లులు, పరిపాలనా పనుల భారంతో తరగతి గది వెనుకబడుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య ఎలా సాధ్యమనే ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది.** - అక్షరటుడే, ఎల్లారెడ్డి

- బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులు బిజీబిజీ
- తగ్గిపోతున్న పాఠాలు చెప్పే సమయం
- ఉమ్మడి జిల్లాలో ఇదే పరిస్థితి..
- ఆందోళన కలిగిస్తున్న టీచర్ల కొరత




కామారెడ్డి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ఆధారపడిన విద్యార్థుల సంఖ్య భారీగా ఉంది. జిల్లాలో మొత్తం 1,020 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 83వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి విద్యాబోధన చేసేందుకు ప్రస్తుతం 4,254 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇంకా 738 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఉపాధ్యాయుల కొరత కారణంగా కొన్ని పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు అనేక తరగతులకు బోధించాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ పోస్టులను త్వరగా భర్తీ చేసి విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### విద్యాప్రమాణాల మెరుగుదలకు..

విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తామని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని పాలకులు పదేపదే ప్రకటిస్తుంటారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తే మాటలకు, చేతలకు మధ్య ఉన్న వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు పోర్టల్‌లో డేటా నమోదు చేస్తూ, బిల్లులు తయారు చేస్తూ, స్ప్రెడ్ షీట్లు నింపుతూ తన రోజును గడపాల్సి వస్తోంది.

### పాఠశాల ప్రారంభం కాగానే..

పాఠశాల ప్రారంభమైన క్షణం నుండి ప్రార్థన కార్యక్రమం, విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ ఆన్‌లైన్ హాజరు నమోదు, పాఠశాలకు రాని విద్యార్థుల వివరాలు సేకరించడం, రాగి జావా పంపిణీ, మధ్యాహ్న భోజన ఏర్పాట్ల పర్యవేక్షణ, ఈ భోజన వివరాల ఆన్‌లైన్ అప్‌లోడ్, పరిశుభ్రత తనిఖీలు, దీంతోనే పాఠశాలలో సగం సమయం గడుస్తోంది. ఇక తల్లిదండ్రులతో మాట్లాడటం, బడి తోట నిర్వహణ, లైబ్రరీ కార్యక్రమాలు, క్రీడల పర్యవేక్షణ, విద్యార్థుల భద్రత, గాయపడిన వారికి ప్రథమ చికిత్స, ఈ పనుల మధ్యలో అవకాశం దొరికితే పాఠం చెప్పడం.

### డేటాకు ఉన్న ప్రాధాన్యత బోధనకు లేదా..?

విద్యాశాఖలో ఒక విచిత్రమైన ధోరణి పెరుగుతోంది. విద్యా ప్రమాణాలు తగ్గితే ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తారు. కానీ ఆ ప్రమాణాలను మెరుగుపరచడానికి అవసరమైన బోధనా సమయాన్ని మాత్రం వారికి ఇవ్వరు.. ఒకవైపు 'ఫలితాలు మెరుగుపర్చండి' అని ఆదేశాలు జారీ చేస్తారు. మరోవైపు అదే ఉపాధ్యాయుడిని డేటా సేకరణ, పోర్టల్ అప్లోలోడ్‌లు, గణాంకాల తయారీ, సమావేశాలు, సర్వేలతో ముంచెత్తుతారు.. చివరకు బోధనకు సమయం లేకపోయినా ఫలితాల బాధ్యత మాత్రం ఉపాధ్యాయుడిదే.

### వాట్సప్‌లో 'అర్జెంట్' అనే సందేశాలే ఎక్కువ..

ప్రస్తుతం విద్యాశాఖలో డేటాకు ఉన్న ప్రాధాన్యత విద్యకు లేదనే విమర్శ వినిపిస్తోంది. విద్యార్థి చదవడం నేర్చుకున్నాడా? లేదా అన్నదాని కంటే పోర్టల్లో సమాచారం అప్‌లోడ్ అయ్యిందా.. లేదా? అన్నదానికే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోంది.

### వేధిస్తోన్న సిబ్బంది కొరత

ప్రస్తుతం అనేక పాఠశాలల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. చాలా బడుల్లో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులే మొత్తం పాఠశాలను నిర్వహిస్తున్నారు. మరోవైపు ఇతర పనులు అప్పగిస్తుండటంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు నష్టపోతున్నారు. బోధనేతర పనుల కోసం ఇతర సిబ్బందిని నియమించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

అధికారులకు క్షేత్ర స్థాయి వాస్తవాల కంటే గూగుల్ షీట్లు, ఎక్సెల్ పట్టికలు, డాష్ బోర్డులు ముఖ్యమైపోయాయి. వాట్సాప్‌లో వచ్చే 'అర్జెంట్' సందేశాలు ఉపాధ్యాయులకు నిత్యకృత్యంగా మారాయి. తరగతి గదిలో బోధన జరుగుతుందా లేదా అన్నదానికంటే డేటా సమయానికి చేరిందా? లేదా అన్నదే ముఖ్యంగా మారడం ఆందోళనకర పరిణామం.



## ఫలించిన సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి కృషి.. ఖరీఫ్‌కు నీటి విడుదల

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఎట్టకేలకు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి కృషి ఫలించింది. జిల్లాలోని గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద ఉన్న ఆయకట్టు రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి విడుదలకు నీటి పారుదల శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో ప్రధానంగా వరి పంట సాగవుతుండగా, పంటలు కీలకమైన పొట్టదశలో ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల పరిధిలోని ఆయకట్టుకు నిజాంసాగర్ నుంచే నీటిని విడుదల చేసి, రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని మంత్రిని కోరారు. అలీసాగర్, గుత్ప లిఫ్ట్‌లకు ప్రతి 10 రోజులకు ఒకసారి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం పంటలకు అత్యంత కీలకమైన దశ కావడంతో తక్షణమే నీటి విడుదల చేపట్టాలని వారు మంత్రిని కోరారు. వారి విజ్ఞప్తిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి, సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే భూపతి రెడ్డి తెలిపారు. ఈ మేరకు అలీసాగర్ ఆయకట్టు పరిధిలోని సుమారు 48 వేల ఎకరాలకు, గుత్ప ఆయకట్టు పరిధిలోని సుమారు 35 వేల ఎకరాలకు కలిపి 83 వేల పైచిలుకు ఎకరాలకు ప్రయోజనం చేకూరేలా నీటిని విడుదల చేయనున్నారు. రోజుకు 1,500 క్యూసెక్కుల చొప్పున 10 రోజుల పాటు నీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరి పంటకు అవసరమైన సమయంలో నీరు అందడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఆర్టీసీ బస్సు ప్రమాద బాధితులకు పరామర్శ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జుక్కల్ చౌరస్తాలో బస్సు ప్రమాదంలో గాయాల పాలైన క్షతగాత్రులను బిచ్కుంద ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా వారిని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పరామర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ మృతి చెందడం పట్ల హన్మంత్ షిండే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని కోరారు.



## ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం..

**అక్షరటుడే, నందిపేట్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తూ వెళ్తోందని డీసీసీ అధ్యక్షుడు నగేశ్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన సంబరాల్లో భాగంగా నందిపేట్ మండల కేంద్రంలో ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై సభ ఏర్పాటు చేశారు. తమ ప్రభుత్వంలో సుమారు 75 వేల ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుబీమా, రుణమాఫీ, ధాన్యం కొనుగోలు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇలా అన్ని పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వినయ్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో దూడ వెంకటేష్, అక్బర్, ఎర్రం సిలిండర్ లింగం, మీసాల సుదర్శన్, బైండ్ల ప్రశాంత్, మందమైపాల్ వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోదీ, అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలి : షబ్బీర్ అలీ



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నడిచిన ప్రాంతాన్ని శుద్ధి చేసిన ఘటనతో పాటు రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడాన్ని షబ్బీర్ అలీ ఖండించారు. ఉత్తరాంఖాండ్‌లోని హాల్ద్వానీలోని రాంలీల మైదానంలో మల్లికార్జున్ ఖర్గే నడిచిన ప్రాంతాన్ని గంగాజలంతో శుద్ధి చేయడం అవమానించడమేనన్నారు. తక్షణమే మోడీ, అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని, గంగాజలంతో ఖర్గే నడిచిన ప్రాంతాన్ని శుద్ధి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ నాయకులు ఏం చార్జిషీట్ ఓపెన్ చేశారని ప్రశ్నించారు. కామారెడ్డి నుంచి పోటీ చేసిన కేసీఆర్‌కు కామారెడ్డిలో వరదలు వస్తే పలకరించే బాధ్యత లేదా అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి వచ్చి ఇటీవల రూ.105 కోట్లు మంజూరు చేశారని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఇక్కడి నుంచి పోటీ చేసిన కేసీఆర్ ఎక్కడపోయాడని, దమ్ముంటే కామారెడ్డికి వచ్చి ఓడిపోయాక రాలేకపోయినందుకు, వరదల సమయంలో రాలేనందుకు క్షమాపణ చెప్పాలన్నారు. ప్రజల్లోకి రాలేని, ప్రజా సమస్యలపై మాట్లాడలేని కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకని, రూ.కోట్ల ప్రజల సొమ్ము తీసుకుని ఫామ్ హౌస్‌లో పడుకోవడానికా అని విమర్శించారు. కేసీఆర్ రాజీనామా చేసి ప్రతిపక్ష హోదా నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు కామారెడ్డి ప్రజలు 60వేల ఓట్లు వేశారని తెలిపారు. కేసీఆర్ రాకుండా చెంచా గాళ్లు వస్తున్నారని, పోటీ చేసింది కేసీఆరా, ఈ చెంచాగాళ్లా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావు, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఘనంగా కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి



**అక్షరటుడే, కామారెడ్డి:** బహుముఖ ప్రజ్ఞాశాలి, హైదరాబాద్ మాజీ మేయర్, స్వాతంత్ర్య సమరయోధుడు కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతిని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్ నగర అభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు కొరివి కృష్ణస్వామి చేసిన సేవలను స్మరించుకున్నారు. మేయర్‌గా బాధ్యతలు నిర్వహించిన కాలంలో నగరాభివృద్ధికి, ప్రజారోగ్యానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. హైదరాబాద్ చరిత్ర, సంస్కృతిపై ఆయన రచించిన 'పిక్టోరియల్ హైదరాబాద్' గ్రంథం నేటికీ నగర చరిత్రకు ప్రామాణిక గ్రంథంగా నిలిచిందని కొనియాడారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, పున్న రాజేశ్వర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, భట్టు విఠల్, శంకర్, రమేష్, రాంచంద్రం, బాలరాజు, నర్సింలు పాల్గొన్నారు.

## రెండు కార్ల మధ్యలో స్కూటీ ఇరుక్కుని బాలుడి మృతి



**అక్షరటుడే, కామారెడ్డి:** రెండు కార్ల మధ్యలో స్కూటీ ఇరుక్కుని బాలుడి మృతి చెందాడు. ఈ ఘటన కామారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హోటల్ ఇంటర్నేషనల్ వద్ద డిగ్రీ కళాశాల వైపు నుంచి కామారెడ్డి బస్టాండ్ వైపు రెండు కార్లు ఒకదాని వెంట ఒకటి వస్తున్నాయి. అదే సమయంలో సడెన్‌గా యూటర్న్ తీసుకున్న ఓ ఎలక్ట్రిక్ స్కూటీ రెండు కార్ల మధ్యలో చిక్కుకుంది. ఈ ప్రమాదంలో శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన హేమంత్ (15) అక్కడికక్కడే మృతి చెందగా.. మరొక బాలుడు లోకేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు వెంటనే వారిని జీజీహెచ్‌కు తరలించారు.



> సాంకేతికతను అందిపుచ్చుకుంటే వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చు తగ్గి, లాభాలు పెరుగుతాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. వరిపంటలో సాంప్రదాయ ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడకం వల్ల తక్కువ ఖర్చుతోనే ఎక్కువ దిగుబడి సాధించవచ్చని స్పష్టం చేశారు.
> – అక్షరటుడే, ఎల్లారెడ్డి

# నానో యూరియాతో లాభాలెన్నో..

**■ ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ.. ■ అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు ■ డ్రోన్ స్ప్రేయర్‌తో పిచికారీ ఈజీ..**

ఎల్లారెడ్డి పరిధిలోని రైతుల పొలంలో డ్రోన్ స్ప్రేయర్ ద్వారా నానో యూరియా పిచికారి చేసి నిర్వహించిన ప్రత్యక్ష ప్రదర్శన స్థానిక రైతులను విశేషంగా ఆకట్టుకుంది. భారీగా తగ్గుతున్న రవాణా, కూలీల భారం ప్రస్తుతం మార్కెట్‌లో సాధారణ యూరియా బస్తా (45 కిలోలు) ధర రూ.266గా ఉంది. అయితే, దీనిని దుకాణం నుండి పొలానికి తరలించడానికి రవాణా ఖర్చులు, పొలంలో చల్లడానికి కూలీల ఖర్చులు అన్నీ కలిపి రైతుపై రూ.700 వరకు భారం పడుతోంది. అదే నానో యూరియా 500 ఎంఎల్ బాటిల్ ధర కేవలం రూ.225 మాత్రమే. అర లీటరు నానో యూరియా బాటిల్.. ఒక పూర్తి బస్తా సాధారణ యూరియాతో సమానంగా పనిచేస్తుంది. దీనిని చేత్తో సులువుగా పట్టుకెళ్లవచ్చు కాబట్టి రవాణా ఖర్చులు పూర్తిగా మిగిలిపోతాయి. దీంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నార.

### డ్రోన్ సాంకేతికతతో..

ఆధునిక డ్రోన్ల ద్వారా పిచికారి చేయడం వల్ల ఎకరానికి కేవలం 350 నుండి 400 ఎంఎల్ నానో యూరియా సరిపోతుంది. ఒకేసారి 10 లీటర్ల ద్రవాన్ని తీసుకెళ్లే సామర్థ్యం ఉన్న డ్రోన్, అతి తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారి పూర్తి చేస్తుంది. దీనివల్ల ప్రస్తుత రోజుల్లో తీవ్రంగా ఉన్న కూలీల కొరత సమస్య తప్పుతుంది. మనుషులు పొలంలోకి దిగాల్సిన అవసరం లేదు కాబట్టి పంట నలిగిపోయే అవకాశం ఉండదు. వర్షాకాలంలో పొలాల్లో తిరిగేటప్పుడు ఉండే పాము కాటు భయాలు, ఇతర ప్రమాదాల నుండి రైతులకు పూర్తి రక్షణ లభిస్తుంది. ఆకులకు నేరుగా ఎరువు అందుతుంది కాబట్టి వృథా కాకుండా మొక్క వేగంగా గ్రహిస్తుంది.

### 25శాతం ఎరువుల ఆదా..

వరి పంటలో 75 శాతం సాధారణ యూరియాతో పాటు, రెండు సార్లు నానో యూరియాను పిచికారి చేస్తే.. వంద శాతం పూర్తి యూరియా వేసిన దానికంటే మెరుగైన దిగుబడి వస్తుందని అధికారులు వివరించారు. దీనివల్ల రైతులకు 25 శాతం ఎరువుల ఖర్చు ఆదా అవుతుంది. అంతేకాకుండా, రసాయన ఎరువుల వాడకం తగ్గడం వల్ల నేల సారం దెబ్బతినకుండా ఉంటుంది. భూగర్భ జలాలు కలుషితం కాకుండా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. నానో యూరియాను వరి పంటలో పిలుకలు పెట్టే దశలో, ఒకసారి, చిరుపొట్ట దశలో రెండోసారి పిచికారి చేస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని వ్యవసాయ నిపుణులు రైతులకు సూచించారు. ఈ ప్రదర్శనలో స్థానిక వ్యవసాయ అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని డ్రోన్ పనితీరును, నానో యూరియా విశేషాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.











# వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి..













## మద్యం మత్తులో ముగ్గురు పిల్లలతో ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు



**అక్షరటుడే, కామారెడ్డి:** మద్యంమత్తులో ఓ వ్యక్తి టాటా ఏస్ వాహనంలో ముగ్గురు పిల్లలను తీసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బయలుదేరాడు. సమాచారం అందుకుని అప్రమత్తమైన పోలీసులు అతన్ని అడ్డుకుని నలుగురి ప్రాణాలను కాపాడారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి చెందిన చిత్తరి రాజు ప్రస్తుతం లింగంపేటలో నివాసం ఉంటూ పాత ఇనుప సామాను వ్యాపారం చేసుకుంటున్నాడు. గురువారం అర్ధరాత్రి మద్యం సేవించిన రాజు భార్యతో గొడవపడి ఆవేశంలో తన ముగ్గురు పిల్లలను వెంటబెట్టుకుని చనిపోతానంటూ టాటా ఏస్ వాహనంలో ఇంటి నుంచి బయలుదేరాడు. ఈ విషయాన్ని గుర్తించిన లింగంపేట బ్లూకోట్స్ సిబ్బంది వెంటనే స్పందించి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. పీసీఆర్ ద్వారా సదాశివనగర్ పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం చేరగానే ఏఎస్సై జగదీష్ వెంటనే అప్రమత్తమై ప్రధాన రహదారులపై గాలింపు చేపట్టారు. వేగంగా వెళ్తున్న టాటా ఏస్ వాహనాన్ని గుర్తించి నిలిపివేసి పరిశీలించగా అందులో రాజు తన ముగ్గురు పిల్లలతో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే లింగంపేట పెట్రోలింగ్ సిబ్బంది కూడా అక్కడికి చేరుకుని రాజుకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలతో సహా అందరినీ క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## బిచ్కుందలో విషాదం.. బస్సు బోల్తా పడి డ్రైవర్ మృతి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** బిచ్కుంద సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుండి బిచ్కుంద వైపు వస్తున్న టీజీఎస్ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ ఆంజనేయులు వాహనం కింద నలిగిపోయి ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. అదృష్టవశాత్తూ బస్సులోని ప్రయాణికులంతా స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుండి బయటపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం..బస్సు జుక్కల్ ఎక్స్ రోడ్ దాటిన తర్వాత కొలాన్ చౌరస్తా సమీపంలోకి రాగానే అదుపుతప్పింది. ప్రమాదం జరగడానికి సుమారు 200 మీటర్ల ముందు నుంచే బస్సు అటుఇటుగా వెళ్లడాన్ని గమనించామని ప్రయాణికులు పేర్కొన్నారు. ప్రమాదాన్ని ఊహించిన ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. అంతలోనే బస్సు తీవ్ర వేగంతో డివైడర్‌ను ఢీకొట్టడంతో, ముందు వైపు ఉన్న రెండు టైర్లు విడిపోయి పక్కకు పడిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 13 నుంచి 15 మంది ప్రయాణికులు ఉన్నారు. పోలీసులు క్రేన్ సహాయంతో బోల్తా పడిన బస్సును పైకి లేపి, కింద చిక్కుకుపోయిన డ్రైవర్ ఆంజనేయులు మృతదేహాన్ని వెలికితీశారు. స్వల్పంగా గాయపడిన ప్రయాణికులను చికిత్స నిమిత్తం మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు.

## గణపతి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

**అక్షరటుడే, మాక్లూర్:** మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో నవయూత్ ఆధ్వర్యంలో గణపతి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. అధికారుల సూచన మేరకు విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు తదతరులు పాల్గొన్నారు.

